క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 10, వంకాయ 15, బెండ 28, పచ్చి మిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజి 15, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 25, దొండ 13–23, చిక్కుడు 55, ఆలు 21, దోస 23, సొర 9, పొట్ల 15, ఉల్లి 12.

వికలాంగుల శాఖను గ్రౌండ్‌ఫ్లోర్‌లో పెట్టాలి

చాదర్‌ఘాట్: నూతన సెక్రెటరియేట్ భవనంలో వికలాంగుల శాఖ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని వికలాంగుల నెట్ వర్క్ ఎన్‌పీడీఓ ప్రతినిధి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ, మహిళా శిశు సంక్షేమశాఖ, సీనియర్ సిటిజెన్స్, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయడం ద్వారా ఉపకరణాల సహాయంతో వచ్చే వికలాంగులకు, వృద్ధులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలకు ట్విట్టర్ ద్వారా కూడా విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు.

పేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూత


పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: నిరుపేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూతనందిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నంది గామ మండలం అంతిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మల్లమ్మ తన కుమార్తె అనిత వివాహం నేపథ్యంలో గురువారం శ్రీనివాస్ గుప్తాను నాగోలులోని ఆయన నివాసంలో కలిసింది. దీంతో ఆమెకు శ్రీనివాస్ గుప్తా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పెళ్లి కూతురు అనిత, నాయకులు శేషు, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి


వాసు చౌదరిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

వనస్థలిపురం: బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన జి.వాసు చౌదరి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసు చౌదరికి ఎమ్మెల్యే రాజేందర్ అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజేందర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, నాయకులు భార్గవ్‌తేజ్, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నయాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ నేతకు ఈటల పరామర్శ

చైతన్యపురి: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీరామోజు షణ్ముఖను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరామర్శించారు. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌కు చెందిన శ్రీరామోజు షణ్ముఖ నిమ్స్‌లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ఆయన ఇంటికి వచ్చి షణ్ముఖ ఆరోగ్యం గురించి ఈటల అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు ఎనగంటి సుధాకర్, సోమేశ్వర్, కుల్‌దీప్ జైన్ తదితరులు ఉన్నారు.

నందు మాదిగకు దళితరత్న అవార్డు

సైదాబాద్: దళితుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తానని సైదాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం నందు మాదిగ అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకల సందర్భంగా బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవ్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ గడ్డం నందు మాదిగకు దళితరత్న అవార్డు ప్రకటించారు. గురువారం ఆయన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్‌ఠాకూర్, శ్రీరాం, రమేష్, మధు, శంకర్, పరమేష్, సాయి, నవీన్, రామారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బలాల నుంచి అవార్డు అందుకున్న నందు మాదిగ

కుక్కల స్వైరవిహారం

- పాదచారులు, చిన్నారులపై దాడి
- రోజురోజుకూ పెరుగుతున్న కుక్కకాటు బాధితుల సంఖ్య


కాలనీల్లో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు


చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి వచ్చిన కుక్క కాటుకు గురైన బాలుడు

వనస్థలిపురం: ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. శునకాల బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కాలనీల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులుగా సంచరిస్తూ దారిన పోయే వారి వెంటపడి మరీ పిక్కలను కొరికేస్తున్నాయి. ముఖ్యంగా వీధుల్లో ఆడుకుంటున్న వారిపై కుక్కలు దాడి చేయడం ఆందోళన కలిగిస్తోంది.

- ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ప్రతి కాలనీలో ఏ గల్లీలో చూసినా వీధి కుక్కలు తిష్టవేసి ఉంటున్నాయి. కాలనీల్లోని చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను, ఇతర ఆహార పదార్థాలను కొందరు యథేచ్ఛగా రోడ్లపై పడేస్తున్నారు. వాటిని తినేందుకు కుక్కలు అక్కడే తచ్చాడుతూ గుంపులుగా తిరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్లపై వెళ్లే పాదచారులు,



చిన్నారులపై తరచూ దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. కుక్కలు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారినీ వదలడం లేదు. ద్విచక్ర వాహనాలను కుక్కలు వెంబడిస్తూ దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. వాటి నుంచి తప్పించుకొనే క్రమంగా వాహనం అదుపుతప్పి పడిపోవడంతో వాహనదారులు గాయపడిన ఘటనలు కూడా జరుగుతున్నాయి. కుక్కల బెడదను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

తీసుకెళ్లి... తీసుకొస్తున్నారు!

కాలనీల్లో గుంపులుగా సంచరిస్తు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న కుక్కలను పట్టుకెళ్లాలని ఎన్నోమార్లు ఫిర్యాదులు చేయంగా ఎప్పుడో ఒకసారి జీహెచ్ఎంసీ అధికారులు స్పందిస్తున్నారని కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. సిబ్బందిని పంపించి దొరికిన కుక్కలను తీసుకెళ్తున్నారని, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించి ఎక్కడి నుంచి తీసుకెళ్లారో అక్కడే వదిలి వెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సంతాన శస్త్ర చికిత్సల మాట అటుంచితే ఉన్న కుక్కల మాటేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు బయటికి వెళ్తే ఇంటికి వచ్చే వరకు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రోజూ 10 నుంచి 20 కేసులు

వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎల్బీ నగర్, పరిసర ప్రాంతాల నుంచి నిత్యం కుక్కకాటు బాధితులు వస్తున్నారు. ప్రతిరోజూ కనీసం 10 నుంచి 20 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. బాధితుల కోసం ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం.
– ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ, వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయండి


కాలనీలోని సమస్యలపై కార్పొరేటర్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

నాగోలు: డివిజన్‌లోని అన్ని కాలనీల్లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ సూచించారు. గురువారం నాగోలు డివిజన్ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ కాలనీ, శ్రీసాయిరాంనగర్ కాలనీ, శ్రీనివాస్‌హిల్స్ కాలనీ, వెంకటరమణ కాలనీల్లోని పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో వెంకటరమణ కాలనీలో నిర్వహించిన అవగాహన సదస్సులో కార్పొరేటర్ మాట్లాడారు. డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు ఆమె తెలిపారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో దోమల బెడద తీవ్రంగా ఉందని, నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ అలేఖ్యరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్ గల్లంతు: రాంరెడ్డి


హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

వనస్థలిపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ డిపాజిట్ గల్లంతు కానుందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురం డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉందని అన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయాడని, ఆయనపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బీజేపీకి బీ పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే పార్టీ మేనిఫెస్టోను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సదాశివుడు, వెంకట్‌రాంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, సుజాత, వినయ్ పటేల్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వేణుయాదవ్, సురేందర్‌రెడ్డి, మంజులా రెడ్డి, సంగీత, యాదమ్మ, అరుణ్, నారాయణ పాల్గొన్నారు.

'సుధీర్‌రెడ్డిని విమర్శించే అర్హత రాంరెడ్డికి లేదు'


సమావేశంలో మాట్లాడుతున్న కటికరెడ్డి అరవిందరెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు, అర్హత ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డికి లేదని బీఎన్‌రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి అన్నారు. బీఎన్ రెడ్డిలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఎమ్మెల్యేపై రాంరెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ గురువారం బీఎన్ రెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. గత 20 ఏళ్లుగా సుధీర్‌రెడ్డి నిత్యం మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్న ఆయనపై ఆరోపణలు చేయటం సిగ్గు చేటన్నారు. ఎల్‌బీ నగర్ వాసులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకే సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి మారాడని అన్నారు. 2014లో మల్‌రెడ్డి రాంరెడ్డికి ఇబ్రహీంపట్నం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవటంతో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే ఓడించిన వెన్నుపోటు చరిత్ర రాంరెడ్డికే దక్కిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, రమేష్‌నాయుడు, శివశంకర్, రమేష్, రాఘవేంద్రరావు, సువర్ణారెడ్డి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌లో పలువురి నియామకం

మన్సూరాబాద్: యువజన కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శిగా కోటేష్‌గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి అధ్యక్షుడిగా రాజేష్‌లను నియమిస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డిలు విడివిగా నియామకపత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కోటేష్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రాజేష్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భీమిడి రామకృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సుధీర్‌రెడ్డి డాక్టరేట్‌పై ఫిర్యాదు చేస్తా: వంగ

చంపాపేట: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తన ప్రచార ఆర్భాటం కోసం ఉపయోగిస్తున్న డాక్టరేట్ ఫేక్‌దని, దీనిపై విచారణ చేయాలని త్వరలో దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తానని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. కర్మన్‌ఘాట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీకి ప్రదానం చేసిన అమెరికాలోని యూనివర్సిటీనే తనకు కూడా డాక్టరేట్ పట్టా ఇచ్చిందని సుధీర్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ చంపాపేట, హస్తినాపురం డివిజన్ల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

రాహుల్ సభ్యత్వం రద్దు అప్రజాస్వామికం



దీక్షలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు నిరసనగా గురువారం గాంధీ భవన్‌లో నిర్వహించిన జై భారత్ సత్యాగ్రహ దీక్షలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని తొలగించడం అప్రజాస్వామికం అని అన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించండి

మలక్‌పేట: డివిజన్‌లోని దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోప్రెషర్ తాగునీటి సరఫరా, రోడ్లపై వాహనాల పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. అలాగే, రోడ్లపై మద్యపానంతో పాటు పార్కు వద్ద అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అల్లరిమూకల ఆట కట్టించాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బన్సీలాల్ కుమార్, ఎస్సై జయంత్, ఎంటామాలజీ గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ


పాల్గొన్న వజీర్ ప్రకాష్‌గౌడ్ తదితరులు

నాగోలు: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వజీర్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఆయన కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ అధ్యక్షుడు కొమ్ము బాబు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, చావా సత్యనాగ, దుర్గాప్రసాద్, వజీర్ గోపి గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నేమూరి భాస్కర్ , బాల నరసింహ, యాదగిరి, నాగేష్, పాశం శ్రీకాంత్ పెరిక నవీన్, మెయిన్ పాషా, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి గల రంగంలో ప్రోత్సహించాలి


వేసవి శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: విద్యార్థులకు ఆసక్తి గల రంగంలో ప్రోత్సహిస్తూ శిక్షణ ఇస్తే వారు ఆయా రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి సూచించారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కరుణశ్రీ సేవా సమితి వారి కారుణ్య సింధు ఆశ్రమంలో బాలబాలికలకు 'మన వారసత్వ సంపద 'వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు పేరిట ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం–2023ను కార్పొరేటర్ ప్రారంభించి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ, ఆధ్యాత్మికత, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. చిన్నాటి నుంచే మంచి విషయాలు నేర్చుకుంటే ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం , సమాజం పట్ల బాధ్యత తెలిసే సంకల్పంతో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంపై ఆశ్రమ నిర్వాహకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, మెజీషియన్ ప్రవీణ్ కుమార్, కన్యాకుమారి పాల్గొన్నారు.

ప్రయాణికుల విశ్రాంతి గది ప్రారంభం


దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రయాణికుల విశ్రాంతి గదిని ప్రారంభిస్తున్న ప్రయాణికురాలు, ఈడీ పురుషోత్తం

చైతన్యపురి: బస్‌ల కోసం వేచి ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం దిల్‌సుఖ్‌నగర్‌లో విశ్రాంత గదిని అందుబాటులోకి తెచ్చామని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. దిల్‌సుఖ్ నగర్‌లో నూతంగా నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి గది ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మహిళా ప్రయాణికురాలు మెగావత్ భూమిక చేతుల మీదుగా విశ్రాంత గదిని ఈడీ ప్రారంభింప చేశారు. అనంతరం మాట్లాడుతూ, దిల్‌సుఖ్‌నగర్ నుంచి నల్గొండ, మిర్యాలగూడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సరైన షెల్టర్ లేకపోవటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి గదిని నిర్మించి అందులో ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీధర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ రాజు, సివిల్ డీఈఈ సత్యనారాయణ, హైదరాబాద్–2 డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి, డిపో సిబ్బంది, పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.


అష్టలక్ష్మి ఆలయంలో చక్రతీర్థం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా చక్రతీర్థం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయ 27వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో అష్టోత్తర శత కలశాభిషేకం 108 వెండి కలశాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరణ, రాజభోగ నివేదన నిర్వహించారు. కాగా, బుధవారం రాత్రి ఆలయంలో చక్రతీర్థం , కల్ప వృక్షవాహన సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్న రథోత్సవం నిర్వహించారు. పూజల్లో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు గంప జగన్, ఐతే అంజయ్య గుప్తా, గౌరిశెట్టి అరుణ్, బాలగోపాల్, చిలుక ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, తమ్మన శ్రీధర్, శ్రీకాంత్ గాండే, ఉమాపతి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులకు వీడ్కోలు


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి తిరుపతి

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టులోని మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఆర్.తిరుపతితో పాటు మరో ఐదుగురు న్యాయమూర్తులు బదిలీపై వెళ్తున్నారు. వీరికి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్ అధ్యక్షతన గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయవాద సంఘం ప్రతినిధులు న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇదే కార్యక్రమంలో జిల్లా కోర్టులో కొత్తగా నియామకమైన 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవీకృష్ణ, 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి సతీశ్ కుమార్‌లకు ఘన స్వాగతం పలికారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి మాట్లాడుతూ, మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఆర్.తిరుపతి, 2వ అదనపు సీనియర్ న్యాయమూర్తి మిలింద్ కాంబ్లేలు జిల్లా కోర్టుకు సుదీర్ఘ కాలం పాటు తమ సేవలను అందించారని ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయి రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు మొలుగూరి ఫణీంద్ర భార్గవ్, బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు ఎం. రాజేందర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమంలో తెలంగాణ ముందంజ

కమిషనర్ శైలజ


ట్యాబ్‌లు అందజేస్తున్న కమిషనర్ శైలజ, అధ్యక్షుడు శ్రీనివాస్

మలక్‌పేట: వికలాంగుల సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని ఆ శాఖ కమిషనర్ శైలజ అన్నారు. మలక్‌పేట ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం వికలాంగుల నెట్ వర్క్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ హస్పిటల్, నెక్స్ టెల్ మెటా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో 10 మంది వినికిడి (బధిర)లోపం కల విద్యార్థులకు 'ఈ సైన్' సైగల భాష పాఠ్యాంశాలతో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కల బాలలకు విద్యను అందించడంలో ప్రభుత్వం తరపున ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు.

పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయండి


పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే అహ్మద్ గురువారం కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షించారు. మలక్‌పేటలో కొనసాగుతున్న, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, జీహెచ్ఎంసీ ఈఈ రాధిక, డీఈఈ ప్రదీప్‌కుమార్, ఏఈలు వెంకన్న, ఎంఐఎం నేతలు షఫీయుద్దీన్, అబ్రార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.